కథా నిలయం
3774
శ్రీకాకుళం

# మిత్రద్వయమూ - మిరియాల జున్నూ

తన కమతంలో ఉన్న గేదెల్లో మూడు ఒక్క మాటు ఈనడంతో నర్సాపురం జమీందారైన సౌజన్యారావుకి ఒక 'బ్రిలియంట్ ఐడియా' వచ్చింది. తన బాల్యమిత్రుడూ, మీదు మిక్కిలి తన క్లాసుమేటూ, ఎన్నిసార్లో తనతో కలిసి ఒక మంచం మీద పడుకోక పోయినా, ఒక కంచంలో తిన్న పెద్దమనిషీ, ఆ తినే పదార్థం జున్ను అయితే అరమోడ్పు కన్నులతో అరడజను ప్లేట్లదాకా అనాయాసంగా ఆరగించేసే సమర్ధుడూ, మొన్న మొన్నటి దాకా ఈ ఊరు కాలేజీలోనే పనిచేసి, ఈ మధ్యనే ప్రమోషన్‌కి ఆశపడి అనకాపల్లి కాలేజీకి వేంచేసిన దురాశాపరుడూ, నర్సాపురం నుంచి అనకాపల్లి రావడంవల్ల జున్నుకి మొహం వాచానని ఏడుస్తూ, అక్షరాలా ఏడుస్తూ, ఈ మధ్య తనకి వారానికో ఉత్తరం రాస్తూన్న దురదృష్ట జాతకుడూ, అన్నింటికంటే మించి తనకిఊహ వచ్చింది లగాయతు ఇప్పటిదాకా జున్ను భక్షణా కార్యక్రమంలో తనతో సమాన ఉత్సాహంతో పాల్గొంటూ, పక్కవాళ్ళకి ప్రోత్సాహాన్నిస్తూ జున్ను ఆరగింపు పోటీల్లో కొత్త రికార్డులు స్థాపించిన మేటీ, జున్ను ఆటగాడూ అయిన సుబ్బారావుకి టెలిగ్రాం ఇచ్చి రప్పిస్తే! పాతరోజులు తలుచుకుంటూ ఇద్దరూ సరదాగా వాటాపంతాలు వేసుకుంటూ, తృప్తి దీరా జున్ను తినొచ్చు. అవును, భలే ఐడియా!

జమీందారీలు గవర్నమెంటు లాగేసుకుంటూండడంవల్ల, ఈ మధ్య అతనిలో తరుచు తలెత్తుతూన్న పిసినిగొట్టు, "టెలిగ్రాం ఎందుకు? దండగ. కార్డు రాస్తే పోలే?'అంటూనసిగాడు. వెంటనే అతనిలో రెస్టు తీసుకుంటూన్న పూర్వపు జమీందారు కళ్ళెర్రజేసి, లేచి కత్తి ఝుళిపించి, "ఏవిటీ? కార్డు రాస్తావా? అది ఎప్పుడందుతుంది? వాడెప్పుడొస్తాడు? ఇది రేపు సాయంత్రంలోగా సొమ్ము చెయ్యకపోతే పులిసి తగలడుతుంది. ఇప్పుడు టెలిగ్రాం ఇస్తే మధ్యాహ్నానికి అంది, వా డే మెయిల్లోనో, ఎక్స్‌ప్రెస్‌లోనో బయలుదేరి సాయంత్రానికి నిడదవోలు వస్తే, రాత్రి తొమ్మిదిన్నర బండికి దర్జాగా నరసాపురం చేరుకుంటాడు. స్టేషనుకి కారువేసుకుని వెళ్ళి, వాడిని

[stamp]

తీసుకురావడం, కబుర్లు చెప్పుకుంటూ, జున్ను సేవిస్తూ, రాత్రి పొద్దు పోయేదాకా సరదాగా కాలక్షేపం చెయ్యడం. ఇదీ ప్లాను. తెలిసిందా? ఇంక నువ్వు నోరుమూసుకో" అంటూ కసురుకున్నాడు.

ఫలితంగా "షీ బఫెలోస్ డెలివర్డ్. స్టార్ట్ ఇమ్మీడియేట్లీ" అంటూ ఒక అర్జంటు టెలిగ్రాం, నరసాపురం నుంచి అనకాపల్లి బయలుదేరింది ఆఘమేఘాల మీద.

'గ్రేట్ మెన్ థింక్ ఎలైక్' అని ఇంగ్లీషులో ఒక సామెత ఉంది. అంటే, గొప్ప వాళ్ళెప్పుడూ ఒక్క మోస్తరుగానే ఊహిస్తూ ఉంటారట. పరస్పర ఒడంబడిక మీద, సౌజన్యారావుని సుబ్బారావూ, సుబ్బారావుని సౌజన్యారావూ, ఎప్పుడో గొప్పవాళ్ళుగా గుర్తించేశారు. ఆ కారణంగా ఇక్కడ నరసాపురంలో ఒక గొప్పవాడు ఇలా జున్నుకి సంబంధించిన ఆలోచనలు చేస్తూంటే, అక్కడ అనకాపల్లిలో కూడా మరో గొప్పవాడైన సుబ్బారావు సరిగ్గా అదే సమయానికి భార్యామణితో తత్సబంధమైన సంభాషణే సాగిస్తున్నాడు.

"భార్యామణీ! అయినా, మీ అమ్మకి అంత బుద్ధి లేదేవిటే?" అన్నాడు సుబ్బారావు ఉన్నట్టుండి. అరగంటనుంచి ఏదో ఆలోచిస్తూ నిశ్శబ్దంగా కూర్చున్న వ్యక్తి, చటుక్కున సబుబూ సందర్భంలేకుండా తన పుట్టింటి మీద ఇలా విరుచుకుపడేసరికి, ఏరుతూ ఏరుతూన్న బియ్యాన్నీ చేటనీ, పక్కకి తోసి, చర్రునలేచి, "ఇప్పుడావిడ అంత బుద్ధిలేని పని ఏం చేసింది?" అంది, బొడ్డులో కొంగు దోపుకుని కజ్జాకు సిద్ధం అవుతూ.

"ఇప్పుడు కాదే! అదే, అప్పుడే మనకి పెళ్ళయిన కొత్తలో. ఆ రోజున నేను టెర్లిన్ సూట్ వేసుకుని రాలేదూ నువ్వు శ్రావణ మంగళవారం పిలుపుకి బయలు దేరుతుంటే..."

భార్యామణికి పదేళ్ళ క్రిందటి మధురమైన సన్నివేశం కళ్ళముందు మెదిలి, శరీరంఅంతా గగుర్పొడిచి, ఆనందంతో ఆలోచిస్తూ ఉండిపోయింది.

"అప్పుడు కంచం నిండా అంత జున్ను పట్టుకువచ్చి పెట్టిందా? నేనేదో కొత్తల్లుడుని! మొహమాటంలో 'అంతెందుకండీ! కొంచెం పెట్టండి చాలు. తక్కింది తీసెయ్యండి' అన్నానే అనుకో, అంటే, లోపలకి పట్టికెళ్ళి అంతా తీసేసి గచ్చకాయంత వుంచి తీసుకు వస్తుందా? కొత్త కనక పాపం మొహమాట పడుతున్నాడని కాస్త ఆలోచించనక్కర్లే? అలా బారుగా తీసేసి, దాదాపు వర్ధి కంచం పట్టుకొస్తే, నాకు ఎంత ఏడుపు వచ్చిందని? ఏవైనా సరే- నువ్వెంత చెప్పు - మీ అమ్మకి బుద్ధిలేదే!" అంటూ ఆర్గ్యుమెంటు పూర్తిచేసి తనే జడ్జిమెంటు కూడా ఇచ్చేశాడు సుబ్బారావు.

"పోనీ అప్పుడు మీ బుద్ధి ఏమైంది? ఇంకొంచెం పెట్టమని అడగొచ్చుగా?" అంటూ క్రాస్ ఎక్జామినేషన్ మొదలు పెట్టింది భార్యామణి, ఎదటి పక్షం ప్లీడరులా.

సుబ్బారావుకి చర్రుమంది.

అతడు దేన్నయినా సహిస్తాడు కాని, జున్ను విషయంలో తన వాదనని ఎవరేనా ఎదిరిస్తే మాత్రం భరించలేడు. అది భార్య అయేది పిల్లలయేది. ఇప్పటిది అయేది, ఇరవయేళ్ళ క్రితంది అయేది. ఏదైనా సరే దాని అంతేదో తేల్చుకోందే ఊరుకోడు. ఎంతసేపు వాదించి అయినా సరే, ముందు దాని సంగతేదో తేల్చుకోవాల్సిందే!

పదేళ్ళ క్రితం జరిగిన సంఘటనలో, "అంత జున్ను తీసెయ్యండి" అనడం తెలివి తక్కువా, ఉన్న పళంగా అంతా తీసెయ్యడం తెలివి తక్కువా అనే అంశం మీద బలాబలాలు తేల్చుకోవడం కోసం, అన్నం వండడాన్ని పదిగంటలు దాకా భార్యామణి వాయిదావేస్తే, అది కారణంగా ఆ పూట కాలేజీకి శలవు పెట్టి తన వాదనకి కావలసిన సాక్ష్యాల్ని సమకూర్చుకో సాగాడు సుబ్బారావు, వంటింట్లో పీట వాల్చుకుని కూచుంటూ.

వాదనలు-ప్రతివాదనలు- దెప్పి పొడుపులు-మూతి విరుపులు-ఆరోపణలు - అవహేళనలు - బుంగమూతులు - బుజ్జగింపులు। ఏవంవిధ కార్య క్రమాలతో ఆ పూట ప్రసారం ఎటూ నిర్ణయం కాకుండా ఆగిపోయి, తదుపరి కార్యక్రమం సాయంత్రం ప్రసారంలో సావుకాశంగా సశేషంగా జరిపించడానికి ఏకగ్రీవంగా నిర్ణయించడమైంది.

జున్ను గురించే ఆలోచిస్తూ భోజనాన్ని పూర్తిచేసి ఒంటిగంటన్నరకి సైకిలెక్కి కాలేజీకి బయలుదేరిన సుబ్బారావుకి, దారిలో జున్నుకి సంబంధించిన ఆలోచనలే వచ్చి వచ్చి చివరికి ఒక కొత్త సూక్తి స్ఫురించింది. అది ఇంగ్లీషులో అంటేనే భేషుగ్గా ఉంటుందనిపించింది.

ఛూజ్ ఛీజ్ అండ్ ఛేజ్!

ఎంత బ్రహ్మాండంగా కుదిరింది ఈ సూక్తి! దీన్ని లోకంలో బహుళంగా ప్రచారం చేసి జున్ను ప్రియులందరికీ తారక మంత్రంగా ఉపదేశిస్తే!... ఓహ్! ఏం బ్రిలియంటు ఐడియా!

ఇలా ఆలోచిస్తూ తియ్యగా మెత్తగా హాయిగా జున్ను లోకంలో తేలిపోతూ జారిపోతూ కాలేజీకి వెళుతూన్న సుబ్బారావుకి, సైకిలు గంటలకీ కారు హారన్లకీ మనుష్యుల శబ్దాలకీ మధ్య, రేడియో కబుర్లు కూడా వినిపించసాగాయి. ఇటూ అటూ వున్న షాపుల్లోనూ ఇళ్లల్లోనూ ఎవరికి ఇష్టం వచ్చిన స్టేషన్లు వాళ్ళు పెట్టుకున్నట్టున్నారు.

ఆ స్టేషన్లలోని వివిధ కార్యక్రమాల యొక్క కొద్ది కొద్ది భాగాలన్నీ కలిపి మొత్తం ఒక వరుస క్రమంలో, ఇలా వినిపించాయి సుబ్బారావుకి.

"జాతికీ జాతికీ మధ్య నున్న వ్యత్యాసాలు తొలగి, ప్రపంచ ప్రజలందరూ సుఖంగా మనుగడ సాగించడానికి అంతర్జాతీయ సమితి ఒక పథకం రూపొందించింది. దాని ప్రకారం... నేటి విద్యార్థులందరూ చదువులు మానేసి సమ్మెలకి దిగి దౌర్జన్యంగా ప్రతి వీధి మొగలోనూ.... శుభ్రంగా జున్ను వండాలి. అలా చేస్తేనే మంచి ఫలితం లభించి అమోఘంగా వుంటుంది. కావలసిన వారు మిరియాలకి బదులు ఏలక్కాయలు వేసుకోవచ్చు."

సుబ్బారావుకి ఆపుకోలేనంత నవ్వు వచ్చింది.సైకిలు మీద వెళుతూనే తనలో తను ఫకాల్న నవ్వుకున్నాడు. తమాషాగా ఉందే! ఇవాళ ఎక్కడి కెళ్ళినా తనకి జున్ను సంగతే జ్ఞాపకం వస్తూ, జున్ను విషయమే, వినిపిస్తోందేవిటి చెప్మా అనుకుంటూ, షెడ్డులో సైకిలు పెట్టి సంతకం చేద్దాం అని బయలుదేరాడు. కలం తీస్తూండగా అతనికో చిలిపి ఆలోచన వచ్చింది. "ఇవాళ క్లాసులో పంచ భక్ష్యాలేవో కుర్రాళ్ళని అడుగుదాం. ఎవరో ఒకరు చెప్పకపోరు. అప్పుడు జున్ను చోష్యమా, లేహ్యమా అని ప్రశ్నిద్దాం. సమాధానం ఏం చెబుతారో విందాం! వాళ్ళు చోష్యం అంటే మనం లేహ్యమనీ, వాళ్ళు లేహ్యం అంటే మనం చోష్యం అనీ కాస్సేపు ఏడిపించి, చివరికి "తోడుపాలు ఎక్కువైనచో కొండొకచో చోష్యంబును, లేగడిపాలు ఎక్కువైనచో వేరొకచో లేహ్యంబును వైకల్పికముగ నగును" అని ఒక సూత్రాన్ని బణాయించి వాళ్ళని డబాయిద్దాం. దాంతో ఘొల్లున నవ్వుతారు. తమాషాగా వుంటుంది.

ఇలా అనుకుంటూ, సన్నగా నవ్వుకుంటూ, సంతకం పెట్టబోతూన్న సమయంలో సరిగా నరసాపురం నుంచి వచ్చిన టెలిగ్రాం అందింది సుబ్బారావుకి. టెలిగ్రాం చూస్తూనే నవ్వుకున్నాడు. సౌజన్యారావుకి నేనంటే ఎంత అభిమానం! అవునుకానీ "జున్ను తినడానికి రమ్మని ఈ టెలిగ్రాము ఏమిటి కుర్రతనం కాకపోతే" అనుకున్నాడు. మళ్ళీ ఆ క్షణంలోనే "అవును ఇందులో కుర్రతనం ఏం ఉంది" అనిపించింది.

ఇంత అప్యాయంగా పిలిచినప్పుడు వెళ్ళాలి. ఆహా... వెళ్ళితీరాలి. తనకీ వెళ్ళాలనే అనిపిస్తోంది... రాత్రికి వెళ్ళి కబుర్లు చెప్పుకుని (పనిలోపని జున్ను కూడా తింటాం అనుకోండి!) తిరిగి పొద్దున్నే వస్తే బాగానే ఉంటుంది. అంతదూరం నుంచి టెలిగ్రాం ద్వారా వచ్చిన జున్నులాంటి ఆప్యాయమైన ఆ పిలుపుని కాదనలేకపోయాడు సుబ్బారావు.

గుమాస్తాని కలుసుకుంటే, తనకింక ఒక్కరోజు లీవు మాత్రమే ఉందని చెప్పాడు. కారణం ఇదని చెబితే జున్ను రుచి తెలియని ప్రిన్సిపాలు ఎక్కడ శలవు ఇయ్యడో అని భయపడి, అర్జంటుగా ఒక ఊరు వెళ్ళాలి, టెలిగ్రాం వచ్చిందని మాత్రం చెప్పి ఆ పూటకీ మర్నాడు ఉదయం పూటకీ కలిపి మొత్తం ఒక రోజుకి శలవుపెట్టి, మర్నాడు తిరిగి ఆ సమయానికి తిరిగి వచ్చెయ్యాలనే సంకల్పంతో ఇంకో అరగంటకి వచ్చే ఎక్స్‌ప్రెస్‌ని అందుకోవడం కోసం బయలుదేరాడు సుబ్బారావు.

కాలేజీకని వెళ్ళిన పెద్దమనిషి, అరగంట కాకుండానే తిరిగి రావడం, వస్తూ వస్తూ తనతో రిక్షా కూడా తీసుకురావడం, జిప్ బేగ్‌లో బట్టలు సర్దుకోవడం, ఇదంతాచూసి ఏం అర్థం కాక, "ఏమిటండీ? ఏమైందీ? వచ్చేశారేం?... బట్టలు సర్దుతున్నారు! ఎక్కడికి ప్రయాణం?" అంటూ భార్యామణి సుబ్బారావుని ప్రశ్నల వర్షంతో ముంచెత్తసాగింది. హాయిగా తియ్యగా ఉండే జున్నులో మధ్య మధ్య వచ్చే మిరియపు పొడిలాగ ఈ ప్రశ్నలేవిటి, మధురంగా తనని ఆలోచించుకోనియ్యకుండా అంతరాయం కలిగిస్తూ?... అసలు సంగతి ఇది అని చెబుదామా అనుకున్నాడు మొదట.

కాని, వెంటనే సుబ్బారావు ఆ ప్రయత్నం విరమించాడు. ఏమంటే, జున్ను అన్నా జున్ను తినేవాళ్ళు అన్నా ప్రిన్సిపాల్‌కే అభిమానం లేదనుకుంటే, అంతకంటే అన్యాయం భార్యామణి. సానుభూతితో అర్థం చేసుకోలేదు. ఇలాంటి వాళ్ళకి చెప్పి లాభం లేదు. పైగా వాళ్లు మన ప్రయత్నాలకి అడ్డం తగులుతారు కూడాను. ఇలాంటి వాళ్ళని శత్రువర్గంలో వాళ్ళలా పరిగణించి ఓకంట కనిపెట్టే ఉండాలికాని మన గుట్టు మట్టులు చెప్పెయ్యకూడదు. ఇలా నిర్ణయించుకోవడం వల్ల అసలు సంగతి చెప్పకుండా జాగ్రత్త పడ్డాడు కానీ, ఆమె ముఖంలోని బేలతనాన్నీ,కళ్లల్లోని కంగారునీ చూసి, కాస్త అయినా చెప్పకుండా ఉండలేకపోయాడు.

పైగా ఈమె తన భార్య. సాక్షాత్తూ తాళికట్టిన భార్య. దాదాపు పదేళ్ళ నుంచి విడాకులు ఇయ్యకుండా అన్యోన్యంగా కాపురం చేస్తున్న సహధర్మ చారిణి. ఇలాంటి దాన్ని, మరీ కేవలం ప్రిన్సిపాల్ లాంటి ప్రమాద శత్రువుల లిస్టులో వేసి, వెరుసుగా చూడ్డం అన్యాయం అక్రమం! ఇలా అనుకుని, చివరికి రిక్షా ఎక్కుతూ పొడిగా రెండు ముక్కలు చెప్పాడు. "రేపు మధ్యాహ్నానికి వచ్చేస్తాను. అర్జంటు పని మీద సౌజన్యారావు టెలిగ్రాం ఇచ్చాడు. నర్సాపురం వెళుతున్నా" అని.

రైల్లో కూచున్నాడన్న మాటేకానీ సుబ్బారావు ఆలోచనలన్నీ నర్సాపురం చుట్టూ, అందులో ముఖ్యంగా సౌజన్యారావు తన ముందుంచబోయే జున్ను తప్పేలాచుట్టూ, కథకళి నృత్యం చేస్తున్నాయి.

టెలిగ్రాంలో 'బఫెలోస్' అని బహువచనం ఉందికదా. ఆ 'ఎస్' సౌజన్యారావు రాసిందేనా, లేక పొరబాటున టెలిగ్రాఫిస్టు అదనంగా చేర్చిందా? అహ... మరేం లేదు. అది నిజమైన బహువచనం అయితే, తన వాటాకి వచ్చే జున్ను మరి కాస్త బహుళంగా వుంటుంది, అంతే!

బహుశా ఈపాటికి జున్ను వండించేసి వుంటాడు. తను వెళ్ళేటప్పటికి చల్లారొద్దూ! పైగా చల్లారిన జున్నే రుచి... ఈ విషయంలో తను అనవసరంగా గాభరాపడనక్కర్లేదు. సౌజన్యారావుకి ఈ కార్యక్రమం అంతా కంఠతావచ్చు. మిరియప్పొడి జున్ను ఉపరిభాగం మీద, అందమైన చీరమీద అద్దకంలా, అమరేలాగ వండించడం, జున్ను కొయ్యడానికి చాకులూ, కోసిన ముక్కలు పెట్టడానికి కంచాలూ (బకాసుర ఆరగింపులలో ప్లేట్లు అనబడే అల్పప్రాణులు నిషిద్ధం) అవి తీసుకు తినడానికి పెద్ద గరెట్లూ (చెంచాలు ఎక్కడ ఆగుతాయి!) సిద్ధం చెయ్యడం. అధ్యాయానికీ, అధ్యాయానికీ మధ్య, నోటిని కాస్త కారం చేసేందుకు ఘాటైన కొత్త ఆవకాయ (వీలైతే జాడీతో సహా) ఎమర్జెన్సీ వార్డులో అమారుగా ఉంచడం, ఇవేవీ వాడికి చెప్పక్కర్లేదు. అన్నీ వాడు చూసుకుంటాడు. తను చెయ్యవలసిందల్లా కంచం ముందు కూచుంటూనే ఓ 'సిక్సర్'తో గ్రాండ్‌గా 'మేచ్' ఓపెన్ చెయ్యడమే!

ఇలా ఇంకా ఆలోచనలు పూర్తి కానేలేదు అప్పుడే నిడదవోలు స్టేషను వచ్చేసింది. అప్పుడే నిడదవోలా అని ఆశ్చర్యపోతూ బోర్డు చూశాడు. పేరు కనిపించింది. ఇక్కడ నర్సాపురంకు మారవలెను అని కూడా రాసి ఉంది... "చాలా రుచిగల బిళ్ళలు! కంపెనీ తయార్!" అంటూ ఓ కేక వినిపించింది. ఆ! అనుమానం లేదు. ఆ కేక వినిపిస్తే అది నిడదవోలు స్టేషనే.

జిప్ బేగ్ తీసుకుని రైలు దిగాడు. అవతల ప్లాట్‌ఫారం మీద నరసాపురం పోయే బండి సిద్ధంగా ఉంది. ఎన్నేళ్ళయినా జూనియర్ ఇంటర్ క్లాసుకీ సీనియర్ డిగ్రీ క్లాసుకీ మధ్యనే అటూఇటూ తారట్లాడే తనబోటి కాలేజీ లెక్చరర్ జీవితం లాంటిదే దీని బతుకూను. ఇటు నిడదవోలు నుంచి నరసాపురం, పోనూ-మళ్లీ అటు నరసాపురం నుంచి నిడదవోలు రానూ, అంతే దీనిపని! ఇందులో ప్రయాణం చేసినవారు ఎంత దూరం అయినా పోతారు. ఇది మాత్రం నరసాపురం వెళ్ళి 'రైట్ ఎబౌటు టర్న్' అంటూఎన్.సి.సి. కేడెట్ లాగ దర్జాగా వెనక్కి తిరిగి నిడదవోలు రావలసిందే.

సుబ్బారావు ఆలోచనల్ని, రైలు కూత, చివాట్లు పెట్టింది. గబగబా వెళ్ళి ఓ పెట్లో ఎక్కాడు. కింద ఎక్కడా నుంచోడానికి కూడా చోటు కన్పించలేదు. పైన సామానులు

పెట్టుకునే బల్లలు మాత్రం నాలుగైదు ఖాళీగా కనిపించాయి. "గుమాస్తా ఉద్యోగాలు దొరకవుకాని, మంత్రి పదవులకేం?" అనుకున్నాడు. చిన్న సర్కస్ ఫీట్‌తో మంత్రి పదవి చేరుకున్నాడు. జిప్ బేగ్ తలకింద పెట్టుకుని, కాళ్ళు జాపేసి కళ్ళు మూసుకున్నాడు. పదవి రాగానే మంత్రిగారికి వచ్చే లక్షణాలన్నీ వచ్చేశాయి సుబ్బారావుకి. గాఢంగా నిద్రపట్టేసింది. రైలు బైలుదేరడం అతనికి తెలియదు.

అరగంట ఆలస్యంగా బయలుదేరినా రాత్రి పది దాటకుండానే రైలు నరసాపురం చేరుకుంది. స్టేషనులో దాదావు రెండుగంటలు రెస్టు తీసుకొని, మళ్ళీ నిడదవోలు బయలుదేరింది. ఇంకా పై బల్లమీద శేషతల్పశాయిలా అలాగే పవ్వళించి రకరకాల శ్రుతుల్లో గురకలేస్తూన్న సుబ్బారావుని చూసి, ఏదో నిడదవోలు వేళ్లేసరుకు. రైలు ఆగీ ఆగడంతోటే వచ్చి పడుకున్నాడు అనుకున్నారు కానీ, ఒఖ్ఖళ్లూ (ఆఖరికి పోర్టర్లుకూడా) నరసాపురంలో దిగవలసిన బాపతు అనీ, స్టేషను అవతల చిన్న కారు వచ్చి వేచి ఉన్నది ఇతనికోసమే అనీ అనుమానించలేదు.

అరగంటసేపు చూసి చూసి, హతాశుడై ఖాళీ కారుని వెనక్కు తీసుకువచ్చిన డ్రైవరుమీద విరుచుకుపడి 'సరిగా చూశావా? జనం అంతా వెళ్లేదాకా ఉన్నావా?' అని కాస్సేపు కేకలు వేసినా, చివరికి సౌజన్యారావు తగ్గిపోక తప్పలేదు. 'సుబ్బారావు రాలేదేవిటి చెప్మా! ఈ ట్రెయిన్‌కి తప్పకుండా రావలసిందే!... ఇందులో రాలేదంటే ఇంకరాడన్నమాట. టెలిగ్రాం అందలేదా? ప్రిన్సిపాల్ శలవు ఇవ్వలేదా? లేదా వీడికేదైనా అర్జంటు పనివుండి, రావడం మానేశాడా? ఎంత కొంప మునిగిపోయే పనివున్నా, సంగతి ఇది అని తెలిస్తే వచ్చి తీరతాడే! మరి ఏం జరిగిందో! ఇలా ఆలోచిస్తున్న సౌజన్యారావుకి ఎదురుగుండా రెండుజున్ను తప్పేలాలు పరిహసిస్తూ కనిపించాయి. అవి తనని చూసి నవ్వుతున్నట్లుతోచింది. సౌజన్యారావుకి వళ్ళు మండిపోయింది. డ్రైవరుకేసి తిరిగి 'టేంక్‌లో పెట్రోల్ ఎంత ఉంది?' అన్నాడు.

"నిండా ఉంది సార్!" అన్నాడు డ్రైవరు. సౌజన్యారావు తలపంకించి,"అయితే బండి గేరేజ్‌లో పెట్టి తాళాలు ఇలా ఇచ్చి వెళ్ళు"అన్నాడు. ఎప్పుడు తెల్లవారుతుందా అని కాసుక్కూచున్న సౌజన్యారావుకి ఆ రాత్రి నిద్దరే పట్టలేదు.

లక్షణంగా నరసాపురం చేరుకొని కూడా, కాలు కిందపెట్టకుండా, అథమం మళ్లీ టిక్కెట్టయినా కొనకుండా, కేవలం మొదట అనకాపల్లిలో కొన్న టిక్కెట్టుతోటే తిరుగు ప్రయాణంకూడా చేసేస్తూన్న అతని మిత్రుడు 'శేషతల్పశాయి'కి మాత్రం మెలుకువ రాలేదు.

రాత్రి రెండు గంటల ప్రాంతంలో కాబోలు ఒక్కమారు, 'జున్ను తప్పేలా తన నోటి దగ్గర్నుంచి ఎవరో లాక్కుపోతున్నట్లు పీడకల' వచ్చి ఉలిక్కిపడి లేచి కూర్చుని కిటికీలోంచి బయటకు చూస్తే, 'భీమవరం' అని బోర్డు కనిపించింది. 'అబ్బ... ఇంకా భీమవరమే! లంఖణాలబోటులాగ ఎంతసేపు నడుస్తుందో ఈ రైలు, గంట ఫర్లాంగుల స్పీడుతో' అని ఓ మారు విసుక్కుని తిరిగి తియ్యని కలల లోకంలోకి జారుకున్నాడు సుబ్బారావు.

తెలతెలవారుతూ పక్షులు కూసే వేళ, ఒళ్ళు విరుచుకుంటూ లేచి 'హబ్బ! ఏం నిద్దరపట్టింది' అని తన గాఢ నిద్రాపరవశతకు తనని తానే అభినందించుకుంటూ, సుబ్బారావు అటూ ఇటూ చూసేసరికి పెట్టె అంతా ఖాళీగా ఒక్కపిట్ట లేరు. రైలుకూడా పూర్తిగా ఆగి వుంది. 'ఓహో! నరసాపురం వచ్చేసినట్టున్నాం' అనుకుని రైలుదిగి ప్లాట్‌ఫారమ్ మీదకి వస్తే కళ్ళు తిరిగినంత పనయింది.

నిడదవోలు!

లైటు వెలుగుపడి జిగేల్‌మన్నాయి అక్షరాలు. ఈ రైల్వే డిపార్టుమెంటు వాళ్ళకి మతిగానీ పోయిందా ఏమిటి? నరసాపురం స్టేషన్‌లో నిడదవోలు బోర్డు ఏమిటి? తను కనుక సరిపోయింది. పాపం కొత్త పేసింజర్లు అయితే కంగారుపడి చావరూ? ఇలా ప్రజల్ని తికమకపెట్టడం ఏంసబబు? బోర్డులు లేకపోతే మానెయ్యాలి. పక్కవాళ్లని అడిగి తెలుసుకుంటారు 'ఇది ఏ ఊరు బాబూ!' అని. అంతేగాని ఏదో ఊరు బోర్డు తీసికొచ్చి ఇంకో ఊరుకి తగిలించేస్తే?

కంప్లైంట్ బుక్‌లో రాద్దామనుకున్నాడు సుబ్బారావు ఒక్కక్షణం. రామాయణంలో పిడకల వేటలాగ జున్నాయణంలో ఈ కంప్లైంటేమిటి పోనిద్దూ అనుకున్నాడు. గేటులో టిక్కెట్టు ఇచ్చిపోదాం అని చూస్తే గేటే కనిపించలేదు. చుట్టూ చూశాడు.

"నిడదవోలు స్టేషన్‌లాగ ఉందే!" అనుకున్నాడు. రైల్వే స్టేషన్లు, గేదెలు, మేజోళ్ళు, ఇంగ్లీషువాళ్ళు, రెండు జడల అమ్మాయిలు- వీటిని గుర్తుపట్టడం మహాకష్టం. అన్ని స్టేషన్లూ ఓలాగే ఉంటాయి. గేదెలూ అంతే. పక్కింటి వాళ్ళ గేదె ఏదో, తమ బీరపాదు తినేసిన గేదె ఏదో ఇప్పటికీ తను పోల్చుకోలేడు. అలాగే ఎడంకాలి మేజోడు ఏదో కుడికాలిది ఏదో కాలు చెప్పవలసిందేకాని తను చెప్పలేడు. ఇంగ్లీషు వాళ్లలో బట్లరూ, బారిష్టరూ ఒక్కరకంగానే కనిపిస్తారు తనకి. అంతెందుకు? క్లాసులో రోజా ప్రశ్న అడగ్గానే సమాధానం చెప్పే అమ్మాయి ఎవరో, ఎంతసేపయినా నోరువిప్పకుండా జాతీయ జెండాలా నిటారుగా నిలబడి ఉండి పోయే పిల్ల ఎవరో, ఆ రెండు జడల అమ్మాయిలలో తను గుర్తించగలడా? ప్చ్,ఇంతకీ ఇది ఏ స్టేషన్ అయినట్టు?

అసలు సంగతి అర్థం అయేటప్పటికి మతి పోయినంత పని అయింది సుబ్బారావుకి, ఇదేవిటి ఇలా జరిగింది? ఇప్పుడేవిటి చెయ్యడం? మళ్ళీ వెనక్కి నరసాపురం వెళదామా అంటే, తనకింక శలవు లేదు. లేని శలవు పెట్టడానికి తనదేమైనా ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంటా? వెయ్యని రోడ్డు వేశాం అనీ, కట్టని 'కల్వర్టు' కట్టేమనీ ఖర్చులు రాయడం వాళ్ళకి చెల్లింది కాని, తనకి కుదురుతుందా? లేని శలవు ఎలా పెట్టావోయ్ చెవలయ్యా అంటూ చెవి నులిమి మరీ ఒక రోజు జీతం నష్టం చేస్తారు. అందువల్ల దేవుడా ఇంత చేశావా అని, తూర్పుగా తిరిగి అనకాపల్లి టిక్కెట్టు కొనుక్కోవడం ఉత్తమం. విజయవాడ నుంచి రైలురాకుండానే స్టేషను బయటికి వెళ్ళి ఆ పని చెయ్యాలి. లేకపోతే నువ్వు అసలు ప్లాట్‌ఫారం మీదికి ఎలా వచ్చావని ఏ టీ.సీ. అయినా టీకీ, టిఫెన్‌కీ సరిపడే డబ్బులు తన దగ్గరనుంచి వసూలు చెయ్యగలడు.

రైల్లో కూర్చున్నాడన్నమాటే కాని సుబ్బారావుకి ఏం ఉత్సాహంగా లేదు. రాత్రి భోజనంలేదు. సరే, జున్ను ఎలాగా ప్రాప్తం లేకపోయింది. ఇంటికి వెళ్ళగానే కడుపునిండా అన్నంతిని మరీ కాలేజీకి వెళ్ళాలి. 'ఏవిటండీ?... ఏవిటి విశేషం? ఎందుకంత అర్జంటుగా నరసాపురం వెళ్ళి వచ్చారు?' అని భార్యామణి అడిగితే ఏం సమాధానం చెప్పేట్టు?

'పెళ్లి' అని చెబుదాం అంటే వాడికి ఎదిగిన పిల్లలు లేరు. పోనీ ఏదో ఆస్తి సంగతులు మాట్లాడడానికి వెళ్ళాను అంటే తన వ్యవహారాలే చూసుకోలేని అసమర్థుడు తను. పోనీ అర్జంటుగా జబ్బు చేసిందని చూడ్డానికి వెళ్ళానంటే! తర్వాత తెలిస్తే?

అబ్బ! వెధవ గొడవ-అన్నింటికి అన్నీను. అప్పటికి తోచిన సమాధానం ఏదో చెప్పి తగలడవచ్చు లెద్దూ. ఇప్పటినుంచే ఎందుకీ లేనిపోని తబ్బిబ్బులు. అసలే ఆకలేసి ఛస్తూ, నిక్షేపం లాంటి జున్ను తినలేక పోతిమే అని ఏడుస్తూంటే! తనని తాను చివాట్లేసుకుని నోరు మూసుక్కూచున్నాడు సుబ్బారావు.

తీరా ఇల్లు చేరుకునే సరికి సుబ్బారావు అంచనాలన్నీ తారుమారయ్యాయి. గేటు తీస్తూనే, భార్యామణి నవ్వుతూ "ఏవండీ, జున్ను హాయిగా తినివచ్చారా? మీ స్నేహితుడు అప్పుడే రానిచ్చాడా?" అంది.

'ఇదేవిటి! నేను జున్ను తినడానికి వెళ్ళానని దీనికెల్లా తెలిసింది? యక్షిణీ శక్తి ఏం లేదుకదా' ఇందుకోసం వెళ్తున్నానని తను ఎవరికీ చెప్పలేదే! లేకపోతే ఆ హడావిడిలో నాకు తెలియకుండా చెప్పేశానా?' ఇలా బిత్తర పోతూన్న సుబ్బారావుతో "నాకు ఎలా తెలిసిపోయిందనా మీ రహస్యం? ఇదిగో ఇదే చెప్పింది" అంటూ టెలిగ్రాం చూపించింది భార్యామణి.

'ఓహో! నిన్న ఆ ప్రయాణం కంగారులో, టెలిగ్రాం ఇంట్లో టేబిల్ మీద మరిచిపోయానన్న మాట!' అనుకుని స్థిమిత పడ్డాడు సుబ్బారావు.

అన్నం వడ్డిస్తూ "ఏమండీ జున్ను ఎలా ఉంది" అంది భార్య.

సుబ్బారావు ఉలిక్కిపడి, అసలు సంగతి దీనికి తెలిసిపోదుకదా అని అనుమానపడి, వెంటనే సర్దుకుంటూ "ఆ... ఏవిటీ?... జున్నా?... జున్నుకేం? నిక్షేపంలా ఉంది" అన్నాడు. "మిరియాలా?..."

"ఊ... ఊ... మిరియాలు.. కాదు కాదు... ఏలక్కాయలు వేసి పంచదారతో వండిన జున్ను... అలా తెల్లబోయి చూస్తావు ఏమిటి? జున్నులో ఏలక్కాయలు కూడా వేస్తారు నీకు తెలియదా? బలే బాగుంటుందిలే.. నిన్నో మొన్నో రేడియోలో కూడా చెప్పారు."

"పోనీ నాకు కొంచెం పట్టుకురాకపోయారా... నేనుకూడా రుచి చూద్దును."

"నీకా?... వద్దులే... నీ కది సయించదు."!

"ఊ... సర్వలక్ష్మమ్మగారు ఏమంటారు?... అదే నండీ... సౌజన్యరావుగారి భార్య!"

"ఆ... ఆ... అవునవును... సర్వలక్ష్మమ్మగారు కదూ?... ఆ! ఏమంటారు? అడిగానని చెప్పమన్నారు."

"అంతేనా? అదేవిటండీ ఆ మధ్యన జరీ ప్లేటంచు చీర ఒకటి కొన్నాను. ఎవరేనా వస్తే పంపిస్తానని ఉత్తరం రాశారు. మీ చేతికి ఇవ్వలేదా?"

"చీరా?... చీరాలేదు... ఏం. లేదు. ఊరికే వాగకు. నా కవతల కాలేజికి టైమయిపోతోంది. ఒకటే ప్రశ్నలు ఒకటే ప్రశ్నలు, వచ్చినప్పటినుంచి చంపేస్తున్నావు... చాల్లే"అంటూ విసుక్కుని కంచంలో చెయ్యి కడుక్కొని లేచి బ్రతుకుజీవుడా అనుకుంటూ కాలేజీకి వెళ్ళిపోయాడు సుబ్బారావు.

జున్ను గొడవా, తన ప్రయాణం గొడవా అన్నీ మరచిపోయి, తక్కిన లెక్చరర్లతో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కాలేజీనుంచి తిరిగొచ్చి, గేటుదగ్గర దిగుతూ బెల్ కొట్టిన సుబ్బారావుకి, భార్యామణి నవ్వుతూ ఎదురువచ్చి గేటు తీసింది.

జరీప్లేటంచు చీరలో కొత్త పెళ్ళికూతురులా మెరిసిపోతోంది. ముసి ముసిగా నవ్వుతూన్న భార్యని కళ్లతో పలకరించి "ఏవిటీ సంగతి?" అన్నాడు సుబ్బారావు.

"అవునుకానీ మీరు తిన్నది ఏవిటండీ? ఏలక్కాయల జున్నా?" అంది భార్యామణి కళ్ళతో నవ్వుతూ.

"అవును... ఇప్పుడు ఆ ప్రశ్న ఎందుకు?" అన్నాడు సుబ్బారావు సైకిలు వరండాలో పెడుతూ.

"పంచదార జొన్న కదూ?" అంది వస్తూన్న నవ్వును ఆపుకుంటూ.

"ఆ... పంచదార జొన్న... ఏలక్కాయలు వేసింది? ఊ... ఇప్పుడేవిటి" అన్నాడు తీక్షణంగా.

"మీరు బహుశా ఒక తప్పేలాడు తిని ఉంటారు... అవునా;..."

"ఆ... సుమారుగా అంతే."

"ఏడిశావులేవోయ్!" అంటూ వసారాలో ఎదురయ్యాడు సౌజన్యారావు.

అమాంతం ఒక భూతం ఎదురుపడినట్టు జడుసుకున్నాడు సుబ్బారావు.

వీడు ఇంట్లోంచి వస్తున్నాడేవిటి? అసలెప్పుడు వచ్చాడు? ఎక్కడనుంచి ఊడిపడ్డాడు!

సందులో జామచెట్టు నీడలో రెస్టుతీసుకుంటూన్న సౌజన్యారావు కారు, గది కిటికీలోంచి కనిపించింది సుబ్బారావుకి.

"ఇదేవిటిరా... ఉత్తరం పత్తరం ఏం లేకుండా ఇలా అమాంతం ఆగంతకుడిలా ఊడిపడ్డావు?" అన్నాడు సుబ్బారావు.

"నోరు ముయ్యవోయ్! నీకు నిన్ననగా టెలిగ్రాం ఇచ్చానుకదా రమ్మని, ఏం చేస్తున్నావు నిన్నటినుంచి?" అన్నాడు సౌజన్యారావు.

"అదేవిటండీ! నిన్ననే బయలుదేరి వచ్చారండీ మీ ఊరు. మీ ఊరినుంచి తిరిగి ఇవాళేగా చేరుకొన్నారు" అంది సుబ్బారావు భార్య.

"ఏడిశాడు... ఏరా... నువ్వు నర్సాపురం వచ్చావా?"

"అదేవిటండీ!... మరి ఎక్కడికెళ్ళారు?... నిన్ననగా వెళ్ళి ఇవాళ వచ్చారు?"

"ఏరా మాట్లాడవేం? నువ్వు వచ్చావా?"

"పంచదార జొన్న... ఏలక్కాయలు వేసింది తిన్నాననికూడా చెప్పారు..."

"అఘోరించాడు..."

"మాట్లాడరేవండీ!"

"ఏం మాట్లాడతాడు? ఏలక్కాయలు వేసిన పంచదార జొన్న అనగానే తెలిసిపోలేదూ, వీడు నీ దగ్గర ఏం కోతలు కోశాడో!"

"రామ రామ... నర్సాపురం వెళ్ళాననీ, జొన్న తిన్నాననీ అబద్ధం ఎందుకు ఆడారండీ!"

'ఏం చెయ్యమంటావు? వీడిలా అర్థాంతరంగా ఈ జొన్న తప్పేలాలు పుచ్చుకొని తనకే మహా కారు ఉంది కదా అని ఇలా వచ్చి ఏడుస్తాడనుకున్నానా?... ఐనా వీడికి బుద్ధిలేదు లెద్దూ, ఏదో మన స్నేహితుడు, భార్యామణితో కాస్త అబద్ధం ఆడి

వుంటాడు. మనం ఇలా అమాంతం కారేసుకుని వెళ్ళిపోతే అవస్థ పడతాడేమో అని కాస్త ఆలోచించనక్కర్లే!' అంటూ కేక లెయ్యసాగాడు సుబ్బారావు....

"సంతోషించాంగాని తమ ప్రగల్భాలకి, లేచి జున్ను తిను, ఆలశ్యం చేస్తే పులిసిపోతుంది..." అన్నాడు సౌజన్యారావు. "అయితే నువ్వు కూడా రంగంలో ప్రవేశించు రెండు తప్పేలాలు వున్నాయి కదా!" అన్నాడు సుబ్బారావు.

నవ్వుకుంటూ, ఎప్పటెప్పటివో జున్ను తాలుకు పాతస్మృతులన్నీ జ్ఞప్తికి తెచ్చుకుంటూ, ఒకరినొకరు "ఇంకొంచెం తిను అంటే ఇంకొంచెం తిను" అని పరస్పరం ప్రోత్సహించుకుంటూ జున్ను తింటున్న ఆ మిత్రద్వయాన్ని చూస్తూ కళ్ళనిండా నవ్వుకుంటూ ప్రక్కనేనిలబడి వుంది సుబ్బారావు భార్య.

"ఎలాగేనా ఇలా బెల్లం మిరియం వేసిన జున్ను రుచే రుచి. పంచదారా ఏలక్కాయలూ వేసింది ఇలా ఉంటుందా! మగవాడి అబద్ధంలా తేలిపోతుంది" అంటూ కొంటెగా తనకేసి చూసిన సౌజన్యారావుతో "అవునురా! గోడకట్టినట్టు అబద్ధం మనం ఆడలేం ఆడవాళ్ళలా. ఆడింది అబద్ధం అని ఇట్టే తెలిసిపోతుంది అదేం ఖర్మమో ఉదాహరణకి నా ప్రయాణం సంగతి చూడు" అని నెమ్మదిగా ఒక్కొక్కటే చెప్పసాగాడు సుబ్బారావు. రైల్లో తను ఎలా నిద్రపోయిందీ, నర్సాపురం రావడం, రెండు మూడు గంటలు ఆగడం తిరిగి బయలుదేరడం ఇది అంతా తనకి ఎలా తెలియందీ, భీమవరం చూచి ఎలా విసుక్కున్నదీ, నిడదవోలు చూచి ఎలా విస్తుపోయిందీ, శలవు లేకపోవడంవల్ల ఎలా తిరిగివచ్చేసిందీ పూసగుచ్చినట్టు వర్ణిస్తూ, ఆప్తమిత్రుడు సౌజన్యారావుతో అలా తను కబుర్లు చెపుతూవుంటే సుబ్బారావుకి హాయిగా తియ్యగా జున్ను తిన్నట్లే ఉంది. కాని, తన మహత్తర రైలు ప్రయాణ గాథ వింటూ ముసిముసి నవ్వులు నవ్వుతూన్న భార్యామణి వేళాకోళం చూపులు మాత్రం, మధ్య మధ్య మిరియప్పొడిలా చురుక్కుమంటూ, కారం కారంగానే తగులుతూ చైతన్యం కలిగించసాగాయి.

*(1972 దీపావళి జ్యోతి)*